వైభవంగా ఆలయ పునఃప్రారంభోత్సవం



అంబర్‌పేట: బతుకమ్మకుంట చెంచుబస్తీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సొంత నిధులు రూ.15 లక్షలతో పునర్ నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గంలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఆధ్యాత్మిక వాతావరణం మానసిక ప్రశాంతతను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, స్థానిక బస్తీకమిటీ ప్రతినిధులు, నాయకులు గెల్వయ్య, శ్రీరాములు ముదిరాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఇక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట




జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో గేట్‌వద్ద కార్పొరేటర్ పావని, ఎస్ఎస్ గోవర్ధన్

చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో వ్యాయామశాల, ఆటస్థలం, అనధికారిక వాహనాల పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి జీహెచ్ఎంసీ ఉద్యోగిని ఇన్‌చార్జి కార్మికుడిని నియమించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ... కార్మికుడిని నియమించడం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి వీలవుతుందన్నారు. అనేక సమస్యలపై వరుస కథనాలు రాసి కమ్యూనిటీహాల్ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఎస్ఎస్ గోవర్ధన్, వెంకటేష్, నాయకులు రత్నసాయి చంద్, మదన్మోహన్, సాయికుమార్, ఆనంద్ రావు, రాజ్‌కుమార్, ప్రశాంత్, గుండు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పద్య నాటకాలలో సందేశం, నీతి ఉంటుంది

ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



చిక్కడపల్లి: పద్య నాటకాలలో సందేశం, నీతి ఉంటుందని ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. సాంస్కృతిక సేవా సంస్థ శ్రీరామకృష్ణా నాట్యమండలి 50 వసంతాల సందర్భంగా ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'నవ జీవితంలో నాట పద్యం'అనే అంశంపై గరికపాటి ప్రసంగించారు. యువతను ఐటీ కంపెనీలు మర యంత్రాలుగా మార్చాయని శ్రీకృష్ణ రాయబారంలోని పద్యాలతో ఉదహరిస్తూ చెప్పారు. కొందరు యువకులు బెట్టింగ్ యాప్‌లతో లక్షల రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. రంగస్థల కళాకారుడు డా. సీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ... ఆధునిక నాటక వికాసంపై ప్రసంగించారు. నిర్మల నృత్య నికేతన్ విద్యార్థులు కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి రిమాండ్



నిందితుడు రాఘవేందర్

అంబర్‌పేట: తాళాలు వేసి ఉన్న నివాసలే లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన బుధవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామంతాపూర్ కేసీఆర్‌నగర్‌లో నివసించే తాళ్ల రాఘవేందర్(26) తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేస్తూ జులాయిగా తిరుగుతాడు. అతడు గతేడాది జూలైలో ప్రేమ్‌నగర్‌లో గోపిరెడ్డి ఉపేందర్‌రెడ్డి ఇంట్లో చోరీ చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. అలాగే ఈ నెల 21న పటేల్‌నగర్‌లో చింతల విక్రమ్ ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా సీసీ టీవీ కెమెరాల సహకారంతో రాఘవేందర్‌ను గుర్తించారు. ఉప్పల్ వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 13 గ్రాముల బంగారు అభరాణాలు, రూ.వెయ్యి, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

కళాకారుల డప్పు, దరువుకు సిద్ధం కావాలి

- కళాకారుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించకపోవడం విచారకరం
- టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో 11 ఏళ్లుగా కళాకారుల సంక్షేమం కోసం తగిన నిధులు కేటాయించకపోవడం అత్యంత విచారకరమని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటపాట వల్లనే తెలంగాణ ఉద్యమం ఉధృతమై ప్రజల్లో చైతన్యం వచ్చిన సంగతిని పాలకులు విస్మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. బుధవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో టీపీఎస్‌కే, పీఎన్ఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

- రూ.40కోట్లు ఎలా ఖర్చు చేస్తారో స్పష్టం చేయలేదు..
- ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కళాకారుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించి దగాపడ్డా కళాకారుల డప్పు, దరువుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడి పాటలే ప్రజలను ముందుండి నడిపించాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 16 నెలల పాలనలో 2025–26 బడ్జెట్‌లో 74 కోట్ల 35లక్షల రూపాయలు సాంస్కృతిక రంగానికి కేటాయించినట్లు పేర్కొందని అన్నారు. అందులో సాంస్కృతిక సారథి కళాకారుల జీతభత్యాల నిర్వహణ కోసం 34కోట్ల 35లక్షలు రూపాయలు పోగా రూ.40కోట్లు తెలంగాణ కళాకారుల అభివృద్ధి ఖాతాకిందికి పోతుందన్నారని అన్నారు. అయితే ఈ రూ.40కోట్లు ఎవరికి ఏ విధంగా ఖర్చు చేస్తారో స్పష్టం చేయలేదన్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఒక మాయ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఒక మాయ అని విమర్శించారు. ఆ శాఖకు పారదర్శకత లేదని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం అంకెల గారడీగానే మారిందన్నారు. తెలంగాణ నాటక రంగం ప్రతినిధి కె. శాతారావు మాట్లాడుతూ.. కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్‌లు ఇవ్వాలన్నారు. బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారుల జేఏసీ కన్వీనర్ మురళీ ధర్ దేశ్‌పాండే, వివిద సంస్థల ప్రతినిధులు రాకేష్ రావన్, శ్రీనివాస్, సాంబరాజు, యాదగిరి, కళ్యాణ్, మారన్న, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డాక్టర్ కమతం శ్రీనివాస్

కాచిగూడ: విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగం అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కమతం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాచిగూడలోని బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్, బద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సయోనారా–2025 పేరుతో 75వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కమతం శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు లనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బదుక్రా పూర్వ విద్యార్థి, స్పోర్ట్స్ ఓఎస్‌డి ఎస్.సుధాకర్ రావు, కళాశాల కార్యదర్శి శ్రీ కిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకిరామ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని చంపిన దస్తగిరిని కఠినంగా శిక్షించాలి



కాచిగూడలో న్యాయవాదులతో కలిసి మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: న్యాయవాది ఇజ్రాయేల్ హత్య తెలంగాణ న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. న్యాయవాదిని అతి కిరాతకంగా నడిరోడ్డుపై హత్య చేశారని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యాయవాదులతో కలిసి ఆయన కాచిగూడలో మాట్లాడుతూ.. న్యాయవాదుల రోణ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. న్యాయవాది ఇజ్రాయేల్‌ను కత్తితో పొడిచి అతికిరాతకంగా చంపిన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు వెంటనే విచారణ జరిపి ఉరిశిక్ష విధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇజ్రాయేల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇలాంటి దారుణాలు న్యాయవాదులపై జరగకుండా చర్యలు తీసుకోవాలని దుండ్ర కుమారస్వామి కోరారు.



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలోని ఫాతిమా మసీదు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు జరిగింది. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ, మసీద్ కమిటీ చైర్మన్ మహ్మద్ జహంగీర్ హాజరయ్యారు. ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బుధవారం నాటి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఖదీర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, సురేందర్, గురుచరణ్‌సింగ్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కవాడిగూడ: వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనంగా రూ. 26వేలు ఇవ్వాలని జీవో నెంబర్ 814 ప్రకారం మినిమం టైం స్కేల్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ.19 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 192 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన దాదాపు 12వేల మంది సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారన్నారు. 30 ఏళ్లుగా వారు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్‌లకు మినిమమ్ టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ. 19వేలుగా నిర్ణయించాలని, ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్ రాము, కోశాధికారి జె. జనార్ధన్‌తోపాటు యూనియన్ నాయకులు, సెక్యూరిటీగార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,75,462



చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం హుండీ కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. ఈనెలలో 10 రోజులకు గాను రూ.1,75,462 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ. దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, సభ్యుడు గణేష్, భక్తులు పాల్గొన్నారు.

'ఎట్టకేలకు స్పందించారు'



చిక్కడపల్లి: 'లేబర్ ఆఫీస్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం'అనే వార్త సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సానిటేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, బీజేపీ నేత వినయ్ కుమార్ అక్కడకు చేరుకుని సిబ్బందితో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. నెల రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన 'సాక్షి'దినపత్రికకు కార్పొరేటర్ పావని, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవ బోధకుడి మృతిపై దర్యాప్తు చేపట్టాలి

ముషీరాబాద్: క్రైస్తవ బోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ముషీరాబాద్ నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్, క్రైస్తవ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ప్రవీణ్‌కుమార్ అనుమానస్పద మృతిపై పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలన్నారు. ప్రవీణ్‌కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందలేదని ఆయన ఒంటిపై తీవ్ర గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవాలన్నారు. ముషీరాబాద్‌లో బుధవారం సాయంత్రం కొవ్వత్తులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ డానియల్, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు బెటినా లంకా, మీసాల జయకుమార్ పల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానగర సంకీర్తన



ట్యాంక్‌బండ్‌పై అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తి గీతాలు ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభరాజు

కవాడిగూడ: అన్నమయ్య 522వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని అన్నమాచార్య భావనా వాహిని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో మహానగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు మహానగర సంకీర్తన ర్యాలీగా చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామి వేషధారణలో సందీప్, అన్నమయ్య వేశాధారణలో అభిరాం అందరినీ ఆకట్టుకున్నారు.

❖ ఈ సందర్భంగా గంటపాటు వేంకటేశ్వరస్వామి గీతాలు ఆలపించారు. పండిత్ కాశీనాథ్ మిశ్రా మాట్లాడుతూ... మాధవ నామమే శరణమని అన్నారు. కల్కి అవతార విశేషాలు తెలియజేస్తూ హరినామ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా పండిత్ కాశీనాథ్ మిశ్రా, శ్రీరామ యోగిజీలను పద్మశ్రీ డాక్టర్ శోభరాజు మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య భావనా వాహిని మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నంద కుమార్, చైర్మన్ పీపీ రాజ్, అన్నమాచార్య భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్‌కు నిధుల కేటాయింపుపై హర్షం



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న బీఓపీడబ్ల్యూఏ, టీబీఎస్ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: బ్రాహ్మణులు, విదేశాల్లో చదువుకుంటున్న పేద బ్రాహ్మణ విద్యార్థుల ఉన్నత విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించడం పట్ల బ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్(బీఓపీడబ్ల్యూఏ), తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) హర్షం వ్యక్తం చేసాయి. బుధవారం ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక శాఖ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ తదితరులను మర్యాద పూర్వకంగా కలిసిన బీఓపీడబ్ల్యూఏ, టీబీఎస్ఎస్ ప్రతినిధుల బృందం శాలువతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొంత కాలంగా బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు మంజూరు చేయకపోవడం కారణంగా విదేశాల్లో చదువుకుంటున్న పేద బ్రాహ్మణ విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు కేటాయించడంతో బ్రాహ్మణ విద్యార్థుల కష్టాలు తీరినట్టేనని పేర్కొన్నారు. త్వరలోనే అపాయింట్‌మెంట్ తీసుకుని సీఎంను కలిసి ధన్యవాదాలు తెలియజేస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం, మంత్రులను కలిసిన వారిలో బీఓపీడబ్ల్యూఏ అధ్యక్షుడు బీవీ సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు,ప్రతినిధులు హెచ్‌వీ.రాంప్రసాద్, పీవీ రాంచంద్రరావు, సీతారామయ్య, రాంబాబు, శ్రీనివాస్ శర్మ, బాచంపల్లి సంతోష్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ర్యాలీకి అనుమతివ్వండి



ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

ముషీరాబాద్: రాంనగర్‌లో హనుమాన్ జయంతి ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ శ్రీ హనుమాన్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు బుధవారం ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా హనుమాన్ ర్యాలీని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొంటారని పోలీసు బందోబస్తు, అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవిచారి, ఉదయ్‌కుమార్, రాజు, గడ్డం నవీన్, రామకృష్ణ, రామ్‌రెడ్డి, నవీన్‌గౌడ్, శివాజీ, అరుణ్, రాకేష్, సత్యనారాయణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్ నైనాదేవికి మహిళా రత్న పురస్కారం



లయన్ నైనాదేవిని అవార్డుతో సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ పీఎస్ నారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ సంఘ సేవకురాలు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ లయన్ నైనాదేవిని సర్వేజన సుఖినోభవంతు సామాజిక, సాహిత్య సేవా సంస్థ బుధవారం బాగ్‌లింగంపల్లిలో మహిళా రత్నా పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య హాజరై మాట్లాడారు. నైనాదేవి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ట్రెజరరీగా ఉంటూ తన సొంత ఖర్చులతో అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌ను ఉచితంగా అందజేశారని తెలిపారు. ఏడు పదుల వయసులోనూ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆదర్శనీయమని అన్నారు. నైనాదేవి నిస్వార్థ సామాజిక సేవలను గుర్తించి మహిళా రత్న అవార్డుతో సత్కరించడం సముచితమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకులు లయన్ డాక్టర్ ఈఎస్. సత్యనారాయణ మాస్టర్, ప్రధాన కార్యదర్శి సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్, రిటైర్డ్ జస్టిస్ పీఎస్ నారాయణ, పి. ఉమాశంకర్‌రెడ్డి, దైవాజ్ఞశర్మ, సోమయాజులు, సురేఖ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి



మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి ఏప్రిల్ మొదటి వారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో చేపట్టనున్న మహాధర్నాకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత నిమ్‌కర్, భూషణ్ భాస్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, కిషోర్, సత్యప్రకాష్ సింగ్ పాల్గొన్నారు.

జీపీఓ పోస్టుల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యమివ్వాలి



మహాధర్నాలో మాట్లాడుతున్న వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ) పోస్టులలో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వీఆర్ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్‌తో వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు మాట్లాడుతూ... వీఆర్ఏలు గత ప్రభుత్వ హయాంలో 80 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలిక సమ్మె పోరాట ఫలితంగా సీఎం రెవెన్యూ అధికారుల సమక్షంలో వీఆర్ఏ జేఏసీ నాయకులతో చర్చలు జరిపారన్నారు. జీఓ నం. 81, 85 ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20555 మంది వీఆర్ఏలలో డిగ్రీ అర్హత ఉన్న వారిని జూనియర్ అసిస్టెంట్స్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్‌గా, 10వ తరగతిలోపు విద్యార్హతలు ఉన్నవారిని ఆఫీస్ సబార్డినేటర్స్‌గా రెవెన్యూ శాఖతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, మిషనగ్ భగీరథ, వైద్య, విద్య తదితర శాఖలలో ఉన్న ఖాళీలలో 16758 మంది వీఆర్ఏలను ప్రభుత్వం సర్దుబాటు చేసిందని గుర్తు చేశారు.

మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు పోస్టులు ఇవ్వకుండా కాలయాపన..

- జీఓ నం. 81, 85 ప్రకారం మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా రెండేళ్లుగా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ గొప్పలు చెపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్ఏ వారసులకు గ్రామ పరిపాలన అధికారి నియామకాలలో ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చి సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన దళిత బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏ కుటుంబాలను ఆదుకొని ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో ముఖ్యఅతిథులుగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్ సోమశేఖర్, ఏఐటీయూసీ నాయకులు బాలరాజు, వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.